ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

# వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జిగా 'ఆమంచి'

పార్టీ కేంద్ర కార్యాలయం అధికారిక ప్రకటన



**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్‌ను వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జిగా ఉన్న రావి రామనాథంబాబును తొలగించి ఆమంచి కృష్ణమోహన్‌కు పర్చూరు నియోజకవర్గ బాధ్యతలు ఇస్తారని చాలా కాలంగా ప్రచారం ఉంది. ఇటీవల బాపట్ల జిల్లా, యడ్లపల్లికి వచ్చిన సిఎం జగన్ ఈ మేరకు రామనాథంబాబుకు చెప్పారు. అప్పటి నుంచి రామనాథంబాబు నియోజకవర్గంలో గడప గడపకూ.. కార్యక్రమంలో పాల్గొనకుండా హైదరాబాద్ వెళ్లిపోయారు. అధికారిక ప్రకటన నేపథ్యంలో ఆమంచి రెండు రోజుల్లో పర్చూరు బాధ్యతలు అందుకుంటారని తెలుస్తోంది.

## కొత్తపట్నం ప్రజలకు బాలినేని క్షమాపణలు చెప్పాలి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల
- నేడు బకింగ్‌హామ్ కెనాల్ వద్ద నిరసన

8లో

## బ్రిడ్జి పనులు జరిగేటప్పుడు హడావుడి ఎందుకు?

- మాజీ ఎమ్మెల్యే దామచర్లపై ఎమ్మెల్యే బాలినేని విమర్శ

8లో

# రోడ్లపై సభల నిషేధం..

# అందరికీ వర్తిస్తుందా.?

- సహేతుకం కాదంటున్న ప్రతిపక్షాలు
- కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- అధికారంలో ఉన్న పార్టీలకే పోలీసులు పరిమితమైన ఫలితం



కందుకూరులో చంద్రబాబు రోడ్‌షోకు హాజరైన జనం (ఫైల్)

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**


కందుకూరులో చంద్రబాబు సభలో తొక్కిసలాటలో ఎనిమిది మంది ఆ పార్టీ అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువకముందే గుంటూరులో ఆయన పాల్గొన్న మరో సభలోనే జరిగిన తొక్కిసలాటలో మరో ముగ్గురు మహిళలు చనిపోయారు. ఈ రెండు ఘటనలలో పోలీసుల పాత్ర చాలా పరిమితంగానే ఉంది. దీన్ని వదిలేసి ఇప్పుడు రోడ్లపై ర్యాలీలు, సభలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. ఇది అన్ని పార్టీలకూ ఒకే రకంగా వర్తిస్తుందా? లేక అధికారంలో ఉన్న పార్టీకి మినహాయిస్తారా? ప్రతిపక్షాలకే అమలు చేస్తారా? అనేది చూడాలి. ఈ నిర్ణయం ఎంతమేరకు సహేతుకమన్నదీ చూడాలి. ఈ నిర్ణయం సహేతుకం కాదని ప్రతిపక్షాలంటున్నాయి. సభలకు, ర్యాలీలకు ప్రత్యామ్నాయంగా స్థలాలు చూడాలంటే పార్టీలపై ఆర్థికభారాలు కూడా పడే అవకాశం ఉంది. రోడ్లకు దూరంగా ప్రజలకు ఇబ్బంది లేని ప్రదేశాలు ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎంపిక చేసిన స్థలాల్లోనే సభలు పెట్టుకునేలా ఆదేశాలు ఇచ్చారు. అత్యంత అరుదైన సందర్భాల్లోనే షరతులతో అనుమతి ఇవ్వాలని అధికారులకు సూచన కూడా చేశారు. షరతులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రోడ్‌షోలు అన్నీ రోడ్లపైనే జరిగాయి. ప్రతిపక్షంలో ఉన్న ప్రతిపార్టీ నేత రోడ్‌షోలు, పాదయాత్రలు చేపట్టారు. జనం భారీగానే తరలివచ్చారు. రోడ్లన్నీ స్తంభించిపోయిన సందర్భాలూ ఉన్నాయి. పాదయాత్రల్లో జనం రోడ్ల వెంట కిలోమీటర్ల పొడవునా నడిచారు. ఇప్పుడు పాదయాత్రలకు అనుమతి ఉంటుందా? ఇదే ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని పాదయాత్రలను కూడా నిలిపేస్తారా? అనేదీ చూడాలి. పెద్దపెద్ద సభలను గ్రౌండ్లలోనే పెడుతున్నారు. ఇటీవలే రోడ్లపై కార్యక్రమాలు పెరిగాయి. జనం భారీగా వచ్చారనే చిత్రాలను చూపించేందుకు ఇరుకున్న రోడ్లను 2లో

# అనర్హుల పేరుతో అర్హుల తొలగింపు.!

- 'వెలుగొండ' నిర్వాసితుల జాబితాలో గందరగోళం
- ముంపు గ్రామాల్లో నెలకొన్న ఆందోళన.!

**ప్రజాశక్తి-మార్కాపురం**

**'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' పరిధిలోని ముంపు గ్రామాల నిర్వాసితుల్లో ఆందోళన నెలకొంది. ఎవరికి ప్యాకేజీ అందుతుందో... ఎవరికి అందకుండా పోతోందోనని భయం పట్టుకుంది. అనర్హుల పేరుతో... అర్హుల పేర్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితా నుంచి తొలగించడమే ఈ ఆందోళనకు కారణం.!**



కుటుంబ సభ్యులతో గుడిపాటి మల్లికార్జునచారి (ఫైల్)

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం కొందరు త్యాగం చేశారు. పుట్టి పెరిగిన ఊర్లతో పాటు స్థిరాస్తులు, ఉపాధి పనులను సైతం వదులుకున్నారు. పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, చింతలముడిపి, కాటంరాజు తండా, మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తండా, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, సాయిరాంనగర్, కృష్ణానగర్, రామలింగేశ్వరపురం గ్రామాల్లోని ప్రజలంతా లక్షలాది మంది జనం బాగు కోసం తమ తమ గ్రామాలను వీడేందుకు అంగీకరించారు. ఉదార స్వభావంతో త్యాగం చేసిన నిర్వాసితులను మాత్రం ప్రభుత్వం సరైన రీతిలో పట్టించుకోలేదు. పోలవరం తరహాలో ప్యాకేజీతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ఆ పద్ధతులేవీ ఇక్కడ అమలుకావడం లేదు. ముంపు గ్రామాల్లో గృహాలకు, పొలాలకు, ఇచ్చిన పరిహారం కూడా తక్కువే.. పెద్ద మనసుతో అంగీకరించిన నిర్వాసితుల జాబితాలో అనర్హులు ఉన్నారని, గతంలో గుర్తించిన వారిని, అక్కడే నివాసం ఉంటున్న వారిని సైతం ప్యాకేజీకి దూరం చేస్తున్నారని తెలిసిన నిర్వాసితుల్లో ఆందోళన నెలకొంది. ఉన్న ఊరిని వదులుకొని.. ప్యాకేజీ లేక.. పునరావాసం లేక... పొరుగూరికి వెళ్లి ఎలా జీవనం సాగించాలని ఒకింత భయం పట్టుకుంది. అర్హులైన వారికి ప్యాకేజీ దక్కకపోతే కట్టుబట్టలతో బయటకు వచ్చిన కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొనక తప్పదు మరి.!

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో 2006లో నిర్వాసితులను గుర్తించేందుకు సర్వే జరిగింది. ఆ సర్వే ప్రకారం 7,319 మంది అర్హులుగా తేల్చారు. వీరిలో 2019 ఆగస్టు 30 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను కూడా ప్యాకేజీకి అర్హులుగా చేర్చడం జరిగింది. తాజాగా వెల్లడించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో ముంపు గ్రామాల్లో 4,317 మంది మాత్రమే అర్హులని అధికారులు లెక్కలు తేల్చారు. 2,647 మందిని అనర్హులుగా పేర్కొన్నారు. వాస్తవంగా వారంతా అర్హులే.. ఎలాగూ మునిగిపోయే గ్రామం కదా.! అని సమీప గ్రామాల్లో, పట్టణాల్లో ఉపాధి కోసం వెళ్లారు. వారంతా పొలాలకు, గృహాలకు నష్టపరిహారం కూడా అందుకున్న వారే.. ప్యాకేజీ విషయానికి వచ్చినప్పుడు ఎలా అర్హులు కాకపోతారని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. నిర్వాసితులకు సంబంధించిన కొందరు అధికారులు, సిబ్బంది సక్రమంగా వ్యవహరించనందునే ఈ విధమైన నష్టం జరుగుతోందని ఆరోపణలు లేకపోలేదు. ఇక్కడ అధికారుల వ్యవహారంతో కంభం యూనిట్ వెలుగొండ కార్యాలయం వద్ద దంపతులు ఆత్మహత్య చేసుకున్న సందర్భం ఉంది. ముందుగా తయారుచేసిన 2లో





నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు, రైతులు

# పొగాకు రైతులను ఆదుకోండి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- గుంటూరు టుబాకో బోర్డు ఈడీ ఆఫీస్ వద్ద రైతుల నిరసన

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం నేతలు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కోరారు. పంట నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నేతలు మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, బాపట్ల పల్నాడు జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల పొగాకు పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం జిల్లాలో 1,01,053 ఎకరాల్లో సాగు పూర్తికాగా, మాండూస్ తుఫాన్ వల్ల 49,735 ఎకరాల్లో పంట దెబ్బతిిందన్నారు. ఇందులో 45,386 ఎకరాల్లో ఎక్కువగా, 4,409 ఎకరాల్లో పాక్షికంగా పంట దెబ్బతిిందన్నారు. ఎక్కువ విస్తీర్ణంలో పంట దెబ్బతినటానికి సాగు అంతా నల్లనేలలు కావడమే కారణమన్నారు. పూర్తిగా పీకి వేసి మరలా నాట్లు వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 10,431 ఎకరాలలో దెబ్బతినగా 69,055 ఎకరాలు ఎక్కువగా, 9,557 వివరాలు పాక్షికంగా దెబ్బతిందన్నారు. 26,200 నుండి పొగాకు రైతులు నష్టానికి గురయ్యారని, గతంలో ఎన్నడూ ఇటువంటి విపత్తు జరగలేదన్నారు. 60 రోజులు పూర్తయ్యి కొట్టడుకు వచ్చిన తోటలను పీకి వేసి మరలా నాట్లు వేయాల్సి రావడంతో, రైతులు ఇప్పటికి ఎకరాకు 45 వేలు రూపాయలకు పైగా పెట్టుబడి నష్టపోవడమే కాకుండా, ఊహించని ప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఎకరాకు నాలుగు క్వింటాళ్లు దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విపత్కర పరిస్థితులలో పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. సమగ్రంగా సర్వే జరిపి, కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం వారికే చెందే విధంగా చర్యలు 2లో

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చీమకుర్తిలోని నెహ్రూనగర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి అణగారిన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన మహిళా ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యం ,బండ్లమూడి సర్పంచి డి. వెంకటలక్ష్మి, ఎంపిటిసి కూడల అంజలిని, మున్సిపల్ కౌన్సిలర్లు గోపురపు రాజ్యలక్ష్మి,పొదిలి వెంకాయమ్మ, మేకల సులోచన,షేక్ రజీయాను సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అణగారిన కులాల ఐక్యవేదిక ఐక్య వేదిక వ్యవస్థాపకుడు పేరం శ్రీను, షేక్ ఖాదర్‌బాషా, జెఎసి అధ్యక్ష కార్యదర్శులు డి.సత్యం, .యలమందబాబు, బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దోమల పుల్లయ్య, కార్యదర్శి పి. శివనాగరాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి. రామారావు, వివిధ సంఘాల నాయకులు మోమిన్ రాంబాబు, ఇస్లర్లశంకర్, పి.సుబ్బారావు, జి.చంద్ర,వి. చిన్న, కూడల మాలకొండయ్య, దావీదు, యాదగిరి పాల్గొన్నారు. **వెలిగండ్ల :** తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయ్‌పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఇంద్ర భూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గోనా వెంగటయ్య,



పామూరులో నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

మండల నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, రంగస్వామి, ఎస్‌సి నాయకులు మల్లెల అంకయ్య, శ్రీను, కొండయ్య, జడ్సన్, కాశిరెడ్డి పాల్గొన్నారు. **దర్శి :** భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శమని డిప్యూటీ తహశీల్దారు ఆకుల రవిశంకర్ తెలిపారు. కస్తూరిబాగాంధీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. అరుణ పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, మార్కు, జె.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. **పొన్నలూరు :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, మంచికలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **.శింగరాయకొండ :** స్థానిక పిఎంసిఏ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. గీతారాణి, చైర్మన్ పి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పాత శింగరాయకొండ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మహిళ ఉపాధ్యాయిలు శాంత కుమారి ధనలక్ష్మి హిమబిందు పద్మశ్రీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సాంబశివ రావు, చెంచురామారావు, మాధవరావు, వెంకట్రావు, ప్రభాకర్ మాల్యాద్రి పాల్గొన్నారు. ఊళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, శింగరాయకొండలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. **పామూరు :** ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలేనని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమ్మీ తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో సుందరయ్య భవనంలో భానుమతి అధ్యక్షతన సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల పర్మిలాదేవి, కె. శంకర్, షేక్ గౌస్‌బాషా, ధనలక్ష్మి, మదారమ్మ, మస్తానమ్మ, అంజలి, కోటమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

## అందరికీ వర్తిస్తుందా.?

(మొదటిపేజీ తరువాయి)

ఎంచుకుంటున్నారు. ఇదొక ప్రచార వ్యూహంగా మారింది. ఈ ధోరణి వైసిపి, తెలుగుదేశం రెండు పార్టీల్లోనూ ఉంది. కందుకూరులో ఇదే కొంపముంచింది. 100 అడుగుల రోడ్డును కుదించి 60 అడుగులకు తగ్గించారు. అటూఇటూ ప్లెక్సీలు కట్టారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఇక ప్రధానంగా తొక్కిసలాట విషయంలో పోలీసుల పాత్ర కూడా చర్చలోకి వచ్చింది. ఎవరు అధికారంలో ఉంటే పోలీసులు వాళ్లకే పరిమితమవుతున్నారు. ప్రతిపక్షాలు పెట్టే సభల వద్ద పోలీసులు పెద్దగా కనిపించడం లేదు. జనం ఒక చోట భారీగా చేరితే బందోబస్తు తప్పనిసరిగా ఉండాలి. వేలాది మంది ఒకచోట చేరితే వారి రాకపోకలను చూడాలి. భద్రత కూడా చూడాలి. అయితే చంద్రబాబు కందుకూరు సభలో పోలీసులు పత్తా లేరు. ఇదొక కారణంగా కూడా తెరపైకి వచ్చింది. చంద్రబాబు కూడా పోలీసుల పాత్రపైనా విమర్శలు చేశారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న పార్టీలకు పోలీసులు తొత్తులుగా మారకుండా ఉంటే మంచింది. ప్రజారక్షణ అనే మాటనే మరిచిపోతున్నారు. పాలకపక్షంలో ఉంటే ఓడిన అభ్యర్థులకు పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే ప్రతిపక్ష ఎమ్మెల్యేకు కనిపించడం లేదు. ఈ ధోరణులు మారాల్సి ఉంది. ఏదేమైనా పార్టీల కార్యక్రమాలపై ఈ నిర్ణయం నియంత్రణగా చర్చ జరుగుతోంది. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలకు ఈ నిర్ణయం ఎక్కువ నష్టం కలిగించేలా కనిపిస్తోంది.

## ప్రతి ఇంటికీ తాగునీరు : సర్పంచి

**శింగరాయకొండ :** శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి జలజీవని మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామని సర్పంచి తాటిపర్తి వనజ తెలిపారు. శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్‌ను మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు, వార్డు సభ్యులు గంజి సుబ్బారావు, కల్లగుంట లక్ష్మి ,చొప్పర వెంకన్న, సవలం కోటేశ్వరరావు, గౌడ పేరు అనిల్ ,అన్నం సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అనర్హుల పేరుతో అర్హుల తొలగింపు.!

(మొదటిపేజీ తరువాయి)

జాబితా ప్రకారం ఆదుకోకపోతే వేలాది కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితులు దాపురించనున్నాయి. ప్రభుత్వం నిర్వాసితులు ఎదుర్కొన్న ప్యాకేజి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించకపోతే ఘోరం జరగనుంది..!ఉదాహరణకు... మార్కాపురం మండంలోని గొట్టిపడియ గ్రామంలో వేల్పుల వెంకటసుబ్బమ్మ ఆ గ్రామానికి సర్పంచిగా పనిచేసింది. అన్ని అర్హతలూ ఉన్నాయి. ప్రస్తుతం ఆమె పేరు జాబితాలో లేదు. పొలం, గృహానికి పరిహారం కూడా అందుకుంది. గ్రామం ఖాళీ చేసేటప్పుడు పునరావాసం లేక... ప్యాకేజీ రాకపోతే ఎలా? అని ఆవేదన చెందుతోంది. పెద్దారవీడు మండలంలోని కలనూతలలో వందలాది మంది పేర్లు జాబితాలో లేకుండా పోయాయి. ఆ గ్రామానికి చెందిన గుడిపాటి బాలమ్మకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు మల్లికార్జునచారితో పాటు ఆయన కుమారులు, కుమార్తెలు జాబితాలో లేరు. బాలమ్మ చిన్న కుమారుడు సుబ్రమణ్యం, ఆయన కుటుంబ సభ్యులు పేర్లు మాత్రం ఉన్నాయి. మల్లికార్జునచారి తల్లి బాలమ్మ అక్కడ ఉన్న పొలాలకు, గృహాలకు పరిహారం పైకం కూడా అందుకుంది. ఆమె పెద్ద కుమారుడు మల్లికార్జునచారితో పాటు ఆయన కుమారులు శివరాంబ్రహ్మం, కోటిలింగ అనే ఇద్దరు కుమారులతో సహా పునరావాస కాలనీల్లో ఇంటి స్థలం పట్టాలు కూడా అందుకున్నారు. తీరా ప్యాకేజీ సమయంలో జాబితాలో మల్లికార్జునచారి కుటుంబీకులు పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మల్లికార్జునచారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్యాకేజి కటాఫ్ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారి జాబితాతో కలుపుకుంటే ఆ కుటుంబంలో మల్లికార్జునచారితో పాటు కుమారులు శివరాంబ్రహ్మం, కోటిలింగ, కుమార్తెలు కుందుర్తి కామేశ్వరి, కుందుర్తి కవితలు కూడా అర్హులే. ఆ కుటుంబంలో మొత్తం ఐదుగురు ప్యాకేజీకి అర్హులు. ఒక్కరూ జాబితాలో లేకపోవడం గమనార్హం.

## పొగాకు రైతులను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న పొగ తోటలకు ఎకరాకు 25 వేల రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న పొగ తోటలకు ఎకరాకు 10వేలు రూపాయలు బోర్డు నిధి నుండి నష్టపరిహారం ఇప్పించాలన్నారు. పొగాకు రైతులకు ఇచ్చిన రుణాలు వడ్డీ లేకుండా రీ షెడ్యూల్ చేసి, మరలా సాగు చేసుకోవటానికి తక్షణమే బ్యారన్‌కు లక్ష రూపాయలు వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల నేతల డిమాండ్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆంద్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, జె.జయంతిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె మాబు, వి.బాలకోటయ్య, టి.శ్రీకాంత్, పొగాకు బోర్డు మాజీ సభ్యులు చుండూరి రంగారావు, ఎపి రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి వి.హనుమారెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా పింఛన్లు: మంత్రి మేరుగ

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్లు అందిస్తున్నారని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం బాపట్ల కలెక్టరేట్‌లోని డిఆర్‌సి సమావేశం హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు లక్షల కోట్ల రూపాయలు నేరుగా అందించారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 2,500 రూపాయల పెన్షన్లు రూ.2,750కు పెంచారన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి తలుపు తట్టి డబ్బులు అవ్వా తాతలకు వాలంటీర్ల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఫించన్ కానుక మెగా చెక్కును మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీలో మంత్రి నాగార్జున, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

**కర్లపాలెం:** కర్లపాలెం మండలంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో 233 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. కర్లపాలెం మండలం మొత్తం మీద 8,071 మందికి పెన్షన్లు అందజేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఒక పింఛను రావాలంటే అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలాగా తిరగాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటికెళ్లి నేరుగా వాలంటీర్ పెన్షన్ అందజేస్తున్నారని అన్నారు. గతంలో 65 సంవత్సరాలు వచ్చిన వారికి పెన్షన్ ఇవ్వటం జరిగేదని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 సంవత్సరాలకు తగ్గించామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు. డ్వాక్రా మహిళలకు కూడా మూడు విడతల వారీగా రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చారని, అలాగే ప్రస్తుతం రెండు విడతల రుణమాఫీ జరిగిందని, మూడో విడత కూడా త్వరలో జరగబోతుందని, ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కేశవ నారాయణ, ఎంపీడీవో ఎలీషాబాబు, ఎంపీపీ యారం వనజ, ఉపాధ్యక్షులు సుబ్బారావు, మండల కన్వీనర్ సీతారామరెడ్డి, సర్పంచులు నక్క లలిత కుమారి, ఎల్లావుల సురేష్ రాదవ్, నాదెండ్ల భానుప్రసాద్, కావూరి చిట్టెమ్మ, గుర్రపుశాల వెంకటేశ్వరమ్మ, కాగితా కరుణకుమారి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు తాండ్ర సాంబశివరావు షేక్ ఆసిఫ్ ఆలీ, లక్ష్మణ్ మండల కో ఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**రేపల్లె:** పేదలకు ఆపన్నహస్తం అందించి ఆదుకునే గొప్పమనసున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కొనియాడారు. రేపల్లె మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం పట్టణంలోని రామకోటిపేటలోని పత్తిపాటి సీతారామయోగిని కళ్యాణ మండపంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి విడతల వారీగా పింఛన్‌ను రూ.3,000కు పెంచుతూ అవ్వాతాతలకు బాసటగా నిలుస్తున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెనుమాల సుశీల, మండల ఉపాధ్యక్షులు రావు నెహ్రూలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**చుండూరు:** చుండూరు గ్రామంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుగుణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ మేరుగ నాగార్జున హాజరయ్యారు. ప్రజా సంకల్ప యాత్రలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను దఫాలుగా పెంచుకుంటూ పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చుండూరు మండలంలో ప్రభుత్వ సంక్షేమ పతకాలు పేదలకు అందించడానికి కృషి చేస్తున్న మండల అధికారులను నూతన సంవత్సరం సందర్భంగా శాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమానికి చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి, మండల ఎంపీపీ జాలాద్ రూబేన్, ఎమ్మార్వో బి కనకదుర్గ, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంతమాగులూరు:** కరోనా సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు అధ్యక్షతన జరిగిన నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో 65 లక్షలు పింఛన్లు ఇస్తుండగా, ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రెండు కోట్ల 32 లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 98 శాతం, దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి అమలు చేశారన్నారు. మండలంలో పార్టీలకు అతీతంగా నూతనంగా మంజూరైన 236 పెన్షన్లతో కలుపుకొని 8,370 పెన్షన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్ పెరటి కోళ్ల పంపిణీని ఆయన ప్రారంభించి పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు. బాలింతలు, గర్భిణులకు, పోషక విలువలు పెంపొందించు కొనేందుకు పెరటి కోళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, తహశీల్దారు అశోకవర్ధన్, ఎంపీడీవో ఎం సాంబశివరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురుయాదవ్, వెలుగు ఏసీ కె రవికుమార్, ఏపిఎం డి మస్తాన్‌రావు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీ శేషు, నాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి, డి గాలెయ్య, బొల్లినేని రామకృష్ణ, రామాంజనేయులు, పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## పెరటి కోళ్ల ద్వారా ఆర్థికాభివృద్ధి

**ప్రజాశక్తి-పంగులూరు**

పెరటి కోళ్ల పెంపకం ద్వారా, డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, పంగులూరు మండల ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులకు వంద యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు నిత్యం కష్టపడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, అందులోనే కొంత సొమ్మును పొదుపు చేసుకోవడం ద్వారా కుటుంబాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారని అన్నారు. ఒక్కో యూనిట్ విలువ 4,800 రూపాయలని, ఇందులో తొమ్మిది పెట్టలు, మూడు పుంజులను, 30 కిలోల దానాను, ఒక మెడికల్ కిట్టును అందజేస్తున్నామని తెలిపారు. ఈ కోళ్లను పెంచుకోవడం ద్వారా మార్కెట్లో గుడ్లకు, మాంసానికి మంచి ధర పలుకుతుందని, దాని ద్వారా ఆర్థికంగా కూడా సభ్యులు బలపడవచ్చని చెప్పారు. ఈ కోళ్ల గుడ్లు, మాంసం బలవర్ధకమైన ఆహారం అని, దాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని ఆయన చెప్పారు. స్వయం సహాయక మహిళలందరూ ఈ కోళ్లను పెంచుకొని, అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుడిపూడి రామారావు, సీసీలు దాసు, కృష్ణవేణి, కామేశ్వరరావు, వివోఏలు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

**ప్రజాశక్తి-కొత్తపట్నం**



మృతురాలు మహమ్మద్ రిక్సార్

చున్నితో ఉరేసుకొని ఓ యువతి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గమండ్లపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ కొక్కిలగడ్డ మధుసూదన్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ రిక్సార్(21) కుటుంబ సభ్యులు గత కొంత కాలంగా గమండ్లపాలెంలో నివాసముంటున్నారు. రిక్సార్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఉరివేసుకొని మృతి చెందింది. ఎస్ఐ మధుసూదన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటింటికీ సంక్షేమ పథకాలు: వెంకటేష్

**ప్రజాశక్తి-చీరాల**

వైసిపి పాలనలో సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రవేశపెట్టి ఇంటింటికీ అందిస్తోందని, వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, చీరాల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. పేద బడుగు బలహీన వర్గాల వారికి అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి వారి అభివృద్ధికి వైసిపి కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి వైసీపీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికలలో వైసీపీకి ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన కోరారు. పసిబిడ్డ నుంచి ముసలమ్మ వరకు సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి లబ్ధిదారులకు బాసటగా నిలిచారన్నారు. అనంతరం వార్డులోని సమస్యల గురించి తెలుసుకొని పలు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి ఆత్మహత్య

**ప్రజాశక్తి-ఒంగోలు క్రైం**

ఒంగోలు మామిడిపాలెం ఎస్ఎస్ టాంక్ 1లో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒంగోలుకు చెందిన కొల్లిబోయిన వెంకట్రావ్ కేంద్రీయ విద్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డుగానూ, మామిడిపాలెం చెరువు వద్ద గల పోలేరమ్మ గుడిలో పూజారిగానూ పనిచేస్తుంటాడు. అయితే నిన్న మధ్యాహ్నం నుంచి కనపడటం లేదని వెతికే క్రమంలో అతని చెప్పులు, సెల్‌ఫోన్ చెరువు గట్టుపై గుర్తించారు. దీనితో చెరువులో రెస్క్యూ టీం గాలించగా అతని మృతదేహం బయటపడింది. ఇటీవల అతని తల్లి మృతిచెందారు. అతని భార్య కూడా అనారోగ్యంతో వుంది. ఇతని కుమార్తెకు వివాహమయి బెంగళూరులో నివాసముంటోంది. దీనితో అతను మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిఉంటారని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాశక్తి-పర్చూరు:** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కా ప్రణాళిక ప్రకారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పర్చూరు మండలం ఇనగల్లు వద్ద సోమవారం అర్ధరాత్రి 2 మినీ లారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎ శ్రీహరి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఒక లారీలో 60 బస్తాలు, మరో లారీలో 80 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్లను విచారించగా 60 బస్తాలు చెరుకూరు నుంచి 80 బస్తాలు అడుసుమల్లి నుంచి చిలకలూరిపేటకు తీసుకువెళ తున్నట్లు వివరించారు. వెంటనే అడుసుమల్లిలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేయగా నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. డీలర్‌పై 6ఏ క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు సిఐ శ్రీహరి తెలిపారు. చెరుకూరు 2 రేషన్ దుకాణాలను తనిఖీ చేయగా 50వ నెంబరు దుకాణంలో 38 బస్తాలు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఆ డీలర్‌పై కూడా 6ఏ కేసు నమోదు చేస్తున్నట్లు వివరించారు. 30వ దుకాణంలో నిల్వలు తగ్గినందున 6ఏ కేసు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం ఇద్దరు రేషన్ డీలర్ల ఆధీనంలో ఉంచుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి వాసుదేవరావు తెలిపారు. తనిఖీలలో విజిలెన్స్ తహశీల్దారు నాగేశ్వరరావు, ఎస్ఐ రామచంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాల బస్సు డ్రైవర్‌పై దాడి

**ప్రజాశక్తి-చీరాల:** ప్రైవేటు కళాశాల బస్సు డ్రైవర్‌తో గుర్తుతెలియని వ్యక్తి గొడవపడి దాడిచేసి గాయపరిచిన సంఘటన మంగళవారం వేటపాలెం రహదారిలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జెపంగులూరు మండలం బూదవాడకు చెందిన ఇ వేణుగోపాల్ రెడ్డి అనే యువకుడు ప్రైవేటు కళాశాల విద్యార్థులు ఎక్కించుకుని చీరాలలోని ఓ కళాశాలకు వస్తున్నాడు. ఈ సమయంలో వేటపాలెం కూడలి వద్దకు రాగా వన్ వేలో రహదారిలో వెలుతున్న బస్సుకు ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై అడ్డుగా వచ్చాడు. దీంతో బస్సు డ్రైవర్‌కు ద్విచక్ర వాహన చోదకుడికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ వేణుగోపాల్‌రెడ్డిపై ఆ వ్యక్తి ఘర్షణ దిగి తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడు. క్షతగాత్రుడిని బస్సులో ఉన్న విద్యార్థులు ఆటోలో ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు.

## నియోజకవర్గస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

**ప్రజాశక్తి-పంగులూరు:** ముప్పవరం కల్చరల్ క్లబ్ 9వ వార్షికోత్సవం సందర్భంగా, అద్దంకి నియోజకవర్గం స్థాయిలో బ్యాట్మెంటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 12వ తేదీన ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ.5 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 800 రూపాయల ఎంట్రీ ఫీజుతో ఈ నెల ఎనిమిదో తేదీలోపు నిర్వాహకులకు అందజేయాలన్నారు. సంక్రాంతి పండుగ రోజు గ్రామంలో ఆడవారికి ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు మనోహర్-9951165350, నితీష్ కుమార్-9398130066, జగన్-9666777529లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## వాలీబాల్ పోటీల్లో బాలికల సత్తా


**ప్రజాశక్తి-బాపట్ల రూరల్:** ఈ నెల 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలో జరిగిన 66వ ఎస్‌జిఎఫ్ఏపి అండర్ 19 బాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికలు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఎస్ఎంజి జూనియర్ కాలేజీ బాపట్ల విద్యార్థినులు ఎం. జ్యోత్స్న, ఎం పావని పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు. వీరిరువురు త్వరలో జరగబోయే జాతీయ స్థాయిలో జరిగే పోటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని బాపట్ల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జి వేదవతి తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వీరిని ప్రోత్సహిస్తూ వస్తున్న వ్యాయామ అధ్యాపకులు వై ఉదయ భాస్కర్ నగదు బహుమతిని అభినందన సభలో అందజేశారు. త్వరలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలలో మెరుగైన ఫలితాలు సాధించాలని, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు.



సమస్యలను పరిష్కరించాలని శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న 108 సిబ్బంది

## 108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-అద్దంకి:** అద్దంకి నియోజకవర్గంలోని 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సదరు ఉద్యోగులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగ భద్రత, వేతన సమస్యలు, విధుల నుంచి తొలగించిన వారికి తిరిగి పోస్టింగ్ వంటి అంశాలను గురించి తెలియచేస్తూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు వారందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలు డివిజన్ కార్యదర్శి పి హరిబాబు, 108 సిబ్బంది ఏ మహేంద్ర, డి ప్రవీణ్‌కుమార్, కె రామాంజినేయులు, మనోహర్, రఫీ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.




మోపిదేవికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## బీసీ హాస్టల్‌ను ప్రారంభించాలి: ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-రేపల్లె:** రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలంలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ... కరోనా కారణంగా గత రెండేళ్లుగా హాస్టల్స్ ని మూసివేశారని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ నేటి వరకు హాస్టల్స్‌ను ప్రారంభించకుండా విద్యార్థులు లేరనే కారణంతో హాస్టల్స్ మూసివేస్తామని ప్రకటన చేయడం సరైనది కాదని అన్నారు. స్పందించిన మోపిదేవి వెంకటరమణారావు హాస్టళ్లను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నిజాంపట్నం మండల కార్యదర్శి శివ, సూర్యప్రకాష్, నాయకులు సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రథమ ఉపాధ్యాయిని సావిత్రిబాయి

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

భారతదేశ ప్రప్రథమ ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, బాపట్ల కార్యవర్గం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. బాపట్ల ఎన్‌జిఓ హోమ్ వద్ద ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ, బీసీ సంక్షేమ సంఘం నేతలు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోలపల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళలు గడపదాటి బయటకు రాకుండా కట్టడి చేసే నాటి సామాజిక పరిస్థితులలో మహిళాభ్యుదయం కోసం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలకు అనుకూలంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేసి ప్రజలలో చైతన్యం రగిలించారని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా మహిళలలో చైతన్యం నింపడానికి విశేష కృషి జరిపారన్నారు. వారి సేవలకు గౌరవంగా సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మన అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

**సంతమాగులూరు:** మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు చదువు ఒక్కటే ఆయుధమని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం విద్యా వనరుల కేంద్రం ఆవరణలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, భారతదేశానికి మొదటి ఉపాధ్యాయు రాలుగా, కుల మతాలకు అతీతంగా సమాజానికి సేవలు అందించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమని నమ్మి ఎన్ని అడ్డంకులు ఎదురైనా, తన లక్ష్యం కోసం ముందుకు సాగిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు వలి ఖాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బాపట్ల రూరల్:** మహిళా విద్యా జ్యోతి వెలిగించిన మహా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ నాయకులు అన్నారు. మంగళవారం బాపట్ల మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు పాల్గొన్నారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేసిన శంకర్రావు మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి మహిళ పాఠశాలను ఏర్పాటు చేసిన తొలి మహిళ పూలే అని కొనియడారు. ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ మాట్లాడుతూ తన సహోపాధ్యాయురాలు షేక్ ఫాతిమాతో కలిసి మనుధర్మ శాస్త్రాన్ని ధిక్కరించి దేశంలోనే తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసిన ధీర వనిత, దేశంలోనే మహిళలోకానికి మార్గదర్శి, గొప్ప స్ఫూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె తాజుద్దీన్, పీరా సాహెబ్, కుర్ర కిషోర్, ఖాదర్ బేగ్, అశ్విని, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

**అద్దంకి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొమ్మనంపాడులో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు వూటుకూరు శ్రీనివాసులు మాట్లాడుతూ చదువు ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని తన మాటల ద్వారానే కాకుండా చేతల ద్వారానే నిరూపించిన మొదటి



బాపట్లలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నేతలు

మహిళా ఉపాధ్యాయిని, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ నాగేశ్వరరావు, కోవి శ్రీనివాసరావు, నూకతోటి కుమారస్వామి, పి శంకరరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, పి వెంకటరావు, కె హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బాపట్ల రూరల్:** స్త్రీల విద్యా వికాసం కోసం పాఠశాలలు నిర్మించి, తన భర్త, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అడుగు జాడలలో నడచి, తాడిత పీడిత స్త్రీల జీవితాలలో వెలుగులు నింపిన దివ్య జ్యోతి సావిత్రిబాయి పూలే అని సాహితీ భారతీ అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి బాపట్లలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి ఫూలే, భర్త జ్యోతిరావు పూలే ప్రేరణతో ఉపాధ్యాయురాలుగా శిక్షణ పొంది, పాఠశాలలను ప్రారంభించి అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యాబోధన చేసి, వితంతు పునర్వివాహాలు జరిపి, వితంతువులకు జన్మించిన బిడ్డలను చేరదీశారని అన్నారు. ఆమె జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటారని ప్రధాన అతిథిగా పాల్గొన్న జ్యోత్స్న వివరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే పాఠశాలల ఏర్పాటుకు నాటి సమాజం ఎంతగా వ్యతిరేకించినా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా, ఎన్ని దాడులు జరిగినా, ఏమాత్రం వెరవక, వెనుకడుగు వేయలేదని అన్నారు. ఈ సభలో సాయిల మురళి, మర్రి మాల్యాద్రి రావు, ఆదం షఫీ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, మస్తాన్‌రెడ్డి, రెంటాల మురళీ రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

**చీరాల:** ఆడపిల్లలు నిర్లక్ష్యానికి గురవుతున్న నాటి సామాజిక పరిస్థితుల్లో తాను విద్యనుభ్యసించి భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి ఆడవాళ్ల కోసం ప్రత్యేక విద్యాలయాలను విజయవంతంగా నిర్వహించిన గొప్ప స్ఫూర్తి ప్రదాత అని పేరాల హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ అన్నారు. మంగళవారం ఆంధ్రరత్న ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె సుశీలను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, ప్రసన్న కుమారి, సిహెచ్ మాధవి, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

**బాపట్ల రూరల్:** ఆధునిక భారత చరిత్రలో సావిత్రీబాయిపూలే ధ్రువతార అని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం బాపట్ల ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ సంఘ సంస్కర్తలలో సావిత్రీబాయి పూలే ఒకరని అన్నారు. ఆమె దేశంలో తొలి



అద్దంకిలో ప్రథమ మహిళా టీచర్ సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదర్శ ఉపాధ్యాయిని. బ్రిటిష్ పాలన నాటి ప్రజల స్థితిగతులు, విద్య, సాంఘిక దురాచారాలు, సతీ సహగమనం, బాల్య వివాహాలు సావిత్రీబాయిని కదిలించాయి. ఈమెది కూడా బాల్య వివాహమే. ఆమె వివాహం సంఘసంస్కర్త జ్యోతిరావు పూలేతో జరిగింది. వివాహానంతరం సావిత్రిబాయికి విద్యాభ్యాసం చేసి ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించారు. కుల వ్యవస్థ నిర్మూలనకు, పీడిత ప్రజానీకం పట్ల ఆమె మనసులో ఆలోచనలను గుర్తించిన జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ప్రారంభించడానికి ప్రయత్నం చేశారన్నారు. ఆమె ప్రధానోపాధ్యాయినిగా 9 మంది పిల్లలతో బడి నడిపేది. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో సావిత్రీబాయిపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరల వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జంగం సామేలు, వెంకటేశ్వర్‌రెడ్డి, నందీశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

**రేపల్లె:** భారత దేశంలో మహిళలకు విద్యను అందించడం ద్వారా మాత్రమే సమాజ పురోగాభివృద్ధి సాధ్యమని గ్రహించిన ఆధునిక సామాజిక విప్లవోద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే తన భార్య అయిన సావిత్రీబాయి పూలేకు స్వయంగా చదువు నేర్పించారని జైభీం భారత్ పార్టీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు పేర్కొన్నారు. బాలికల కోసం 1848 జనవరి 1న పూణే పట్టణంలో మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించారని అన్నారు. ఆమె జన్మదినమైన జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రి బాయి ఫూలే 192వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి వివిధ సంఘాల నాయకులు అభిమానులతో కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జైభీం భారత్ పార్టీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ, బలహీనవర్గాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆండ్రాజు రామరాజు, టిడిపి వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలా జోజిబాబు, అరుణశ్రీ వికలాంగుల సంఘం అధ్యక్షులు జానం మురళి, బిసి నాయకులు సాయిబాబు, ఉపాధ్యాయులు ఆవుల సాంబశివరావు రేపల్లె నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు కాలే జక్రయ్య, న్యాయవాది దారం సాంబశివరావు, కర్రా బాబురావు, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**కర్లపాలెం:** కర్లపాలెంలో గ్రామ చావిడి దగ్గర ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు పేరాల వెంకట సురేష్ మాట్లాడుతూ మహిళల అభివద్ధికి సావిత్రిబాయి పూలే గొప్ప కృషి చేశారు అన్నారు. స్త్రీ సాధికారతలో ఆమె కృషి వెలకట్టలేనిదన్నారు. కర్లపాలెం అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు ఎం పరమానంద కుమార్, బీసీ నాయకులు ఎస్ శ్రీనివాసరావు, ఆర్ పున్నారావు, వెంకటేశ్వర్లు, పోలీసురావు పాల్గొన్నారు.



సంతమాగులూరులో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి..



బాపట్లలో సావిత్రి బాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు



రేపల్లెలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి

# రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

## గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి గొర్రెల మేకల పెంపకందారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఖండే బాలకృష్ణ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారుల రౌండ్ టేబుల్ సమావేశం గోసు చిన్నకాశయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖండే బాలకష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఈ వత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. జీవాలకు సీజన్ వ్యాధులు సోకి నల్లగా పారుతున్నట్లు తెలిపారు. పశువైద్యశాల్లో జీవాలకు



మాట్లాడుతున్న ఖండే బాలకృష్ణ

సంబంధించిన మందులు అందుబాటులో లేవని తెలిపారు. దీంతో పెంపకందారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ పశు నష్టపరిహారం నిధులు గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. 90శాతం సబ్సిడీతో షెడ్లు మంజూరు చేయాలన్నారు. 50 శాతం సబ్సిడీతో ప్రతి గొర్రెల కాపరికి రూ.5లక్షల రుణం ఇవ్వాలన్నారు. జీవాల ఉత్పత్తికి అనుగుణంగా టీకాలు సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వత్తి సంఘాల నాయకులు రాయల మాలకొండయ్య, మండల వత్తి సంఘాల నాయకులు ఆయనకోట రంగస్వామి, మల్లేపోయిన తిరుపతయ్య, అన్నయబోయిన శ్రీను, బోరిగోర్ల మాధవ్, కె.పెద్దగోవిందయ్య, వీరాచార్యులు పాల్గొన్నారు.





ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి మహంతి కిశోర్

## ప్రజాశక్తి క్యాలెండర్ అవిష్కరణ

ప్రజాశక్తి 2023 నూతన క్యాలెండర్‌ను డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ ఇంతియాజ్, షేక్ అజీజ్, 21వ బ్లాక్‌కన్వీనర్ షేక్ కరిముల్లా, ప్రజాశక్తి మార్కాపురం రూరల్ విలేఖరి షేక్ అస్లాం బాషా పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

సభలు, సమావేశాలను నిషేధిస్తూ తెచ్చిన

## జీవోను ఉపసంహరించుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

**ప్రజాశక్తి-దర్శి**

రోడ్లపై సభలు, ర్యాలీల నిషేధంపై తెచ్చిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం నాయకుల సమావేశం సీనియర్ నాయకులు సందు వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కు అని తెలిపారు. ఎంపిక చేసుకున్న సభలు, ర్యాలీలకు అనుమతి కావాలంటే కేవలం వైసిపి మాత్రమే అనుమతిస్తారని అని ఆయన విమర్శించారు. అర్హులందరికీ పించన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, నాయకులు కెవి. పిచ్చయ్య, అంజయ్య, షేక్ కాలేబాషా, నాగేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

## ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ బత్తుల

### కుమార్తె వివాహానికి ఆహ్వానం

**శింగరాయకొండ :** ఎపిఎస్ఆర్‌టిసి జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజా రెడ్డి, వైసిపి ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి దంపతుల ద్వితీయ కుమార్తె సాయి శివాని వివాహ వేడుకలు ఈనెల 27న నెల్లూరులో జరగనున్నాయి. అందులో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి లోని ఆయన నివాసంలో వైసిపి ఒంగోలు పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 27న జరగనున్న తమ కుమార్తె వివాహానికి హాజరు కావాలని తొలి వివాహ ఆహ్వానపత్రిక అందజేశారు. శింగరాయకొండలో నిర్వహిస్తున్న వివాహరిసెప్షన్‌కు రావాలని కోరారు. అదేవిధంగా శింగరాయకొండ జాతీయ రహదారిపై డాక్టర్ వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి ఆర్చి, రెండు విగ్రహాలను ఏర్పాటు చేశామని వాటిని ప్రారంభించాలని ముఖ్య మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆర్చికి సంబం ధించిన వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. జనవరి చివరిలో లేదా ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి వచ్చే డేట్‌ను బట్టి వివాహ రిసెప్షన్, ఆర్చి ప్రారంభోత్సవం ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేయనున్నారు.



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అంజేస్తున్న బత్తుల

## 8 నుంచి క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాశక్తి-సిఎస్‌పురం**

సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని కోవిలంపాడులో కెవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి సిఎస్‌పురం, పామూరు మండలాలస్థాయిలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కెవైఎఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30,116 నగదు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.20,116 నగదు ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 7వ తేదీలోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసు కోవాలన్నారు. పూర్తి వివరాలకు నెం.9347427623, 81259 06539 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి : ఐద్వా

**ప్రజాశక్తి-పామూరు**

ఐద్వా జాతీయ 13వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సుందరయ్య భవనం సెంటర్‌లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి. షమ్మీ మంగళవారం జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా షమ్మీ మాట్లాడుతూ జనవరి 6 నుంచి 9 వరకూ కేరళ రాజధాని తిరువునంతపురం ఐద్వా జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షులు భానుమతి, కార్యదర్శి ఖాదరున్నీసా, నాయకులు బత్తుల పర్మిలదేవి, ధనలక్ష్మి, కోటమ్మ, అంజలి, ప్రభావతి, మస్తానమ్మ, మదారమ్మ, కె. శంకర్, సిహెచ్.వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఎగరవేస్తున్న ఎస్‌డి షమ్మీ

ప్రజాసమస్యల పరిష్కారానికే ..

## గడపగడపకూ మన ప్రభుత్వం : బాలినేని

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. 33వ డివిజన్ శివప్రసాద్ కాలనీ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిం చారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కుల,మతాలు, పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్‌కె.నాగూర్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు రషీదా, కమిషనర్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

**వైసిపిలో చేరిక....**

33వ డివిజన్ శివప్రసాద్‌కాలనీ చెందిన టిడిపి నాయకులు దోసకాయలపాటి నాగమ్మ,కుమారి, పలువురు మహిళలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**విగ్రహం ఆవిష్కరణ....**

నగరంలోని రాంనగర్ విద్యుత్తుశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సావిత్రిభాయ్ పూలే కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు.

**బాలినేనిని కలిసిన ఎస్‌పి**

మాజీ మంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్ మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు విషయాల గురించి చర్చించారు.



బాలినేనికి శుభాకాంక్షలు చెబుతున్న ఎస్‌పి

## విద్యార్థులకు ఆటల పోటీలు

**ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్**

సంక్రాంతి పండుగ సందర్భంగా కొప్పోలు ఊరచెరువు ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను 10వ డివిజన్ కార్పొరేటర్ బెంగులూరు నరసయ్య ప్రారంభించారు. తొలుత కార్పొరేటర్ నరసయ్య క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ డి. వరదారెడ్డి, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, దివి రామయ్య, గ్రామస్తుడు కోనంకి హనుమంతరావు, ఉపాధ్యాయులు పి. వీరరాఘవులు, కోడెల కోటయ్య, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కార్పొరేటర్

## రాష్ట్రస్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

**ప్రజాశక్తి-కనిగిరి**

శింగరాయకొండలో ఎస్‌జిఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కనిగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ జాన్ తెలిపారు. అండర్-17 బాలుర వాలీబాల్ విభాగంలో ఎన్. ఎర్రబాబు, అండర్-14 బాలుర వాలీబాల్ విభాగంలో సిహెచ్.చరణ్, అండర్-14 బాలుర విభాగం కబడ్డీ పోటీల్లో యశ్వంత్ ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రమణ్య, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

## విద్యార్థులకు అభినందనలు

**ప్రజాశక్తి-టంగుటూరు**

అండర్-14 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీ లకు టంగు టూరు లోని మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కొమ్ము రాజారావు తెలిపారు. గత నెల 31న శింగరాయకొండలో నిర్వహించిన వాలీబాల్ పోటీల అశోక్, శ్రీను పాల్గొని ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రాజారావు, పిఇటి వెంకట్రావు, రంగస్వామి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.





పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ

**సిఎస్‌పురం :** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం 8వ తరగతి విద్యార్థినులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పెదరాజుపాలెం సర్పంచి నాగమణి చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ విద్యార్థినులు ట్యాబ్‌లను సద్వి నియోగం చేసుకొని సాంకేతిక విద్యలో రాణించా లన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని శీలంవారిపల్లి కెవి.నరసయ్య, లక్ష్మమ్మ, హైస్కూల్‌లో సర్పంచి కదార్బ్ బుజ్జి చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రూ.25 వేల విరాళం అందజేత

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

మండల పరిధిలోని ఇమ్మడిచెరువు గ్రామ టిడిపి ఇన్‌చార్జి బత్తుల తిరుపతిరెడ్డి టిడిపి కనిగిరి నియోజవకర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న అన్నా క్యాంటిన్‌కు రూ.25వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా చిన్నవెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, బిసి సెల్ జిల్లా యువ నాయకులు గవదకట్ల హరికృష్ణపాల్గొన్నారు.

## పాఠశాలకు బల్లలు బహూకరణ

**పొదిలి :** పాఠశాలలు, గ్రామాల అభివృద్ధికి స్నేహ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఇఒ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అక్కచెరువు ప్రభుత్వ పాఠశాలలకు హైదరాబాద్ కు చెందిన స్నేహ ఫౌండేన్ ఆధ్వర్యంలో ఇనుప బల్లలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి లేదా సంస్థ తాను సంపాదించే ఆదాయంలో 20 శాతం సమాజ సేవలకు ఉపయోగించడం ద్వారా పేదలకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడాలన్నారు. స్నేహ ఫౌండేషన్ మేనేజర్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు, గ్రామాల అభివృద్ధికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం స్నేహ ఫౌండేషన్ మేనేజర్ రఘునాథ రెడ్డిని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చేరెడ్డి సుబ్బారెడ్డి, సంస్థ సిబ్బంది కె.బాల్ రెడ్డి, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు గాలిముట్ట రమేష్, షర్మిల, గ్రామస్తులు త్.దితరులు పాల్గొన్నారు.

## వరికూటి అశోక్‌బాబుకు సన్మానం

**జరుగుమల్లి :** జరుగుమల్లి మండలానికి చెందిన వైసిపి నాయకుడు పల్లా కోటిరెడ్డి కొండపి ఎఎంసి డైరెక్టరుగా నియమితులయ్యాడు. అందులో భాగంగా వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించాడు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెద్దిరెడ్డి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

**మద్దిపాడు :** మద్దిపాడులోని శ్రీ కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ కాకతీయనగర్ కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి మండల వెంకటేశ్వర్లు రూ.51 వేల విలువైన కంప్యూటర్‌ను మంగళవారం బహూకరించారు. అదేవిధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మజ్జిగ పంపిణీ కోసం రూ.30 వేల రూపాయలు అందజేశారు. వెంకటేశ్వర్లు ప్రతినిధి స్థానికుడు ఆరి సూర్యనారాయణ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గంగాధర్ నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి, కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## గుండెపోటుతో న్యాయవాది మృతి

**బేస్తవారిపేట :** బేస్తవారిపేటకు చెందిన సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి చెంచురామిరెడ్డి (60) గుండెపోటుతో మంగళవారం మతి చెందారు. చెంచురామిరెడ్డి తన నివాస గృహంలో ఉదయాన్నే న్యూస్ పేపర్ చదువుతూ ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించి వైద్యులు అప్పటికే చెంచురామిరెడ్డి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. గిద్దలూరు బార్ అసోసియేషన్ సభ్యులు చెంచురామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే


దర్శిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి- కురిచేడు**

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. నూతనం పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లం కోటేశ్వరమ్మ, తహశీల్దారు నాగూర్ మీరా, ఎంపిడిఒ భవ్య, నాయకులు ఏరువ పిచ్చి రెడ్డి, బెల్లం చంద్రశేఖర్, కాసు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. **దర్శి :** అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. 223 మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కుసుమకుమారి, ఎఎంసి ఛైర్మన్ వైవి.సుబ్బయ్య, ఎంపిపి గోళ్లపాటి సుధారాణి, వైస్‌ఎంపిపిలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, ఎంపిటిసి సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, తహశీల్దారు శ్రావణ్‌కుమార్, నగరపంచాయతీ కమిషనరు మంజునాథ్ గౌడ్, ఇఒఆర్‌డి గుప్తా శోభన్‌బాబు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు **శింగరాయకొండ :** నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కట్టా శోభారాణి, వైస్ ఎంపిపి సామంతుల రవి కుమార్ రెడ్డి, ఎంపిటిసి అంబటి ప్రసాద్, ఎంపిడిఒ షేక్ జమీ ఉల్లా , సర్పంచి తాటిపర్తి వనజ , డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు , వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, శీలం రమణయ్య, షేక్ అబ్దుల్లా ,షేక్ పటేల్, మాలే ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

**సభపై వైసిపి నాయకులు - సభ ఎదుట ప్రజాప్రతినిధులు**

లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై వైసిపి నాయకులు కూర్చున్నారు. సభ ఎదురుగా జనంలో ప్రజాప్రతినిధులు దర్శన మిచ్చారు. ప్రభుత్వ కార్యక్ర మానికి అధికారులు సభాధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఎంపిటిసిలను జనంలో కూర్చోబెట్టారు. సర్పంచుల గురించి కూడా పట్టించు కోలేదు. వేదికపై వైసిపి నేతలను కూర్చోపెట్టబట్టం పట్ల ఎంపిటిసిలు, సర్పంచుల గుసగుసలు వినిపించాయి. **మార్కాపురం :** నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారుకులు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకష్ణ, ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డిడిఒ సాయికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.నరసింహులు పాల్గొన్నారు. **పిసిపల్లి :** మండల పరిధిలోని పోతవరం గ్రామంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు సర్పంచి గోవిందమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.వెంకట నారాయణ పాల్గొన్నారు. **టంగుటూరు :** నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పటాపంజుల కోటేశ్వరమ్మ, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, కొండపి ఎఎంసి మాజీ వైస్ చింతపల్లి హరిబాబు, ఎంపిడిఒ అజిత, ఎపిఎం గంటా శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి నర్రా జగదీష్ బాబు, సర్పంచులు శివరామరాజు, బిళ్లా ఝాన్సీరాణి, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు,నాగేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గం చైర్మన్ సునీత,నాయకులు ఉదయ్ కుమార్, మురళీకష్ణ పాల్గొన్నారు. నాగులుప్పలపాడు : మండల పరిధిలోని పోతవరం గ్రామంలో ఎంపిపి నలమలపు అంజమ్మ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అంజుల , ఎంపిడిఒ వేణుకుమారి, సర్పంచి శీలం రేణుక, వైసిపి వాణిజ్యవిభాగం రాష్ట్రకార్యదర్శి నలమలపు కష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు అంజిరెడ్డి, సురేష్ ,పద్మ గ్రామస్తులు పాల్గొన్నారు. **పొదిలి :** మండల పరిధిలోని ఏలూరు గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు వైసిపి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, వైసిపి మండల మాజీ కన్వీనర్ గుజ్జుల సంజీవ రెడ్డి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **మద్దిపాడు :** మండల పరిధిలోని ఇనమనమెళ్ళూరు గ్రామంలో లబ్ధిదారులకు ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఏడుకొండలు, కన్వీనర్ ఆకుల శ్రీను, కార్యదర్శి కె. విజయ తదితరులు పాల్గొన్నారు

## పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

పేదల సంక్షేమమే ధ్యేయం ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఏదురాళ్లపాడు బీసి, ఎస్‌సి కాలనీలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గడప గడపకూ తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచి భవాని తిరుపతిరెడ్డి, ఎంపిటిసి చక్కర వెలుగొండయ్య, పోలయ్య, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఎపిఎం కె.గోపాల కష్ణారెడ్డి, ఎపిఒ శ్రీనివాసరెడ్డి, వెలుగొండ ఆలయ చైర్మన్ ఎస్. తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్య క్షుడు వెంకటేశ్వరరెడ్డి, నాయ కులు రాచమల్ల వెంకట రామిరెడ్డి, దిబ్బారెడ్డి, జిల్లా మండల ఎస్సీ సెల్ నాయకులు కోటేశ్వరరావు, థామస్ పాల్గొన్నారు. **జరుగుమల్లి :** మండల పరిధిలోని చతుకుపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట నుంచి పచ్చాకు పనులకు వచ్చిన వలస కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాతంగి చంద్రలీల, ఎంపిడిఒ పి .రామకృష్ణ,ఎపిఒ కొక్కొలిగడ్డ నాగరాజు, ఎంఇఒ బత్తల నాగేంద్రవదన్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ పల్లా శివకోటిరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, కసుకుర్తి చిన కొండయ్య, కసుకుర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు.


పచ్చాకు కూలీలతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

## నిర్వాసితులను ఆదుకోవాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న గాలి వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

శ్రీపూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీని పెంచి వారిని ఆదుకోవాలని నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి కోరారు. మండల పరిధిలోని గొట్టిపడియ గ్రామంలో వెలుగొండ ప్రాజెక్టు కంభం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి ఎస్‌డిసి వెంకటసుబ్బయ్యను కలిసి ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎదుర్కొం టున్న సమస్యలపై వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా గాలి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019లో ప్రకటించిన కటాఫ్ తేదీని రద్దు చేసి నిర్వాసితులకు నష్టపరి హారం చెల్లించేంత వరకూ పొడిగించాలని కోరారు. ముంపు గ్రామాల పరిధిలోని 11 గ్రామాలకు చెందిన నిర్వాసితులకు రూ.1400 కోట్లు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిపడియ గ్రామస్తులు వేల్పుల చెన్నారెడ్డి, తుమ్మ వెంకటరెడ్డి, వేల్పుల కాశిరెడ్డి, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ బాలనాగయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న వైసిపి పభుత్వం : ఉగ్ర


రాష్టానికి ఇదేమి కర్మలో ఉగ్ర నరసింహారెడ్డి

**సిఎస్.పురం :** వైసిపి ప్రభుత్వం మోసపురిత మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువున దోపిడీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విమర్శించారు. సిఎస్‌పురంలో ఇదేంకర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురించేస్తున్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, ఉపసర్పంచి పి.నరసయ్య, నాయకులు ఎన్‌సి. మాలకొండయ్య, రామకష్ణంరాజు, రాజాబ్ బాషా, రవిచంద్ర, వెంకట కొండయ్య పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

## వారి వలలో చిక్కి విలువైన సమాచారం, సొమ్ము నష్టపోవద్దు: ఎస్పీ వకుల్ జిందాల్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

వేలల్లో పెట్టుబడులుపెట్టి, లక్షల్లో లాభాలు స్వీకరించండి అంటూ చెప్పే నకిలీ యాప్‌లు, ఫేక్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం లాంటివి చేయవద్దని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఫేక్ యాప్స్‌లో పెట్టుబడులు గురించి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో రోజు రోజుకూ ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగిపోతున్నాయన్నారు. ఎక్కువ మంది కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషిస్తున్నారని, దీనినే సైబర్ నేరగాళ్లు మంచి అవకాశంగా తీసుకుంటున్నారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు అని చెప్పి నకిలీ యాప్‌లలో పెట్టుబడులను పెట్టిస్తున్నారన్నారు. తక్కువ పెట్టుబడి పెట్టినప్పుడు లాభాలు ఇచ్చి ఆశ కల్పించి ఎక్కువ పెట్టుబడి పెట్టే విధంగా ప్రోత్సహించి, ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా వినియోగదారులను మోసం చేస్తున్నారన్నారు. వినియోగదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండి ఫేక్ యాప్ లలో డబ్బులను పెట్టుబడి పెట్టినా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కడమే కాకుండా, బ్యాంకు ఖాతా సమాచారం అంతా చోరీకి గురయ్యి, ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఎటువంటి పరిస్థితిలోనూ అపరిచిత నకిలీ యాప్‌లలో పెట్టుబడులు పెట్టకూడదని, మీ వ్యక్తిగత సమాచారం ఆధార్, పాన్‌కార్డులు, ఓటిపిలను అపరిచిత యాప్‌లలో పంచుకోవద్దని పేర్కొన్నారు. మోసపోకుండా ఉండాలంటే ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలని ఎస్పి హెచ్చరించారు. నకిలీ యాప్‌ల మోసానికి గురైతే వెంటనే సంబంధిత బ్యాంక్, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని ఎస్పీ సూచించారు.



పోలీసులు రూపొందించిన ప్రచార పత్రం


ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే శరత్, బాధితురాలు వెంకటమ్మ

## పింఛన్ పునరుద్ధరించాలంటూ బైఠాయింపు

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

తనకు సంవత్సరంన్నర నుంఎతీ పెన్షన్ నిలిపివేశారని, పూర్తి వికలాంగుడైన తన మనవడికి కూడా పెన్షన్ రావడం లేదని చెరుకుపల్లి ఎస్టి కాలనీకి చెందిన పెంద్ర వెంకటమ్మ మంగళవారం చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు కే శరత్ బాధితురాలికి న్యాయం చేయాలని ఆమెతో కలిసి బైఠాయించి అధికారులకు నిరసన తెలిపారు. వివరాల ప్రకారం చెరుకుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన పెంద్రా వెంకటమ్మ, ఆమె ఇరువురు కుమారులు వేరువేరుగా నివసిస్తున్నప్పటికీ హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే కుటుంబంగా నమోదు జరిగింది. వీరందరికీ వేరువేరుగా కరెంటు మీటర్లు ఉన్నాయి. దీనివలన ముగ్గురు ఒకే హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఉండడం వలన ముగ్గురికి కలిపి 300 యూనిట్లు పైనే బిల్లు రావడంతో పెన్షన్ ఆగిపోయింది. తమ కుటుంబాలను వేరు వేరు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేయాలని, తమ పెన్షన్లు పునరుద్ధరించాలని కలెక్టర్ నుంచి పంచాయతీ స్థాయి వరకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసిన ఫలితం లేకపోవడంతో కార్యాలయం వద్ద బైఠాయించినట్లు కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేసీఆర్ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితురాలికి జరిగిన పరిస్థితిని పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని ఎంపీడీవో బి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

## క్రీడలలో రాణించాలి: డాక్టర్ బాబూరావు

**ప్రజాశక్తి-చీరాల**

విద్యార్థినులు చదువుతోపాటు క్రీడలలో రాణించి అభివృద్ధి చెందాలని అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో యార్లగడ్డ అన్నపూర్ణమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందు ఉంటుందని, అందులో భాగంగా ఇటీవల మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న త్రివేణి, రమ్య, జ్యోతి, చిన్న లీల, వెంకట ఐశ్వర్య, గాయత్రి, ఎస్.కె షర్మిల విద్యార్థులు నేషనల్ క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్‌కు సెలక్ట్ కావటం అభినందనీయమని అన్నారు. ఈ నేపథ్యంలో అస్సాం రాష్ట్రంలో జరగనున్న క్రీడలలో పాల్గొనేందుకు వెళ్ళనున్న విద్యార్థినులకు వారి ఖర్చుల అవసరార్థం రోటరీ క్లబ్ ద్వారా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. అక్కడ జరిగే పోటీలలో ఉత్తమ ప్రతిభ సాధించి కళాశాలకు, చీరాల ప్రాంతానికీ మంచిపేరు తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కృష్ణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, ఎంవి రామారావు, ఎస్‌వి స్వామి, డివి సురేష్, పోలుదాసు రామకృష్ణ అధ్యాపకులు విద్యార్థినులు పలువురు పాల్గొన్నారు.


గంగా భవానికి నివాళి అర్పిస్తున్న జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ (ఇన్‌సెట్‌లో) గంగాభవాని (ఫైల్)

## గంగా భవాని మృతి తీరని లోటు

### జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ

**ప్రజాశక్తి-పర్చూరు**

నిత్యం ప్రజల సమస్యల కోసం పరిష్కారమయ్యేంతవరకు పట్టువిడవని ధీర వనితలాగా పరితపించే పర్చూరు జడ్పీటీసీ సభ్యురాలు కొల్లా గంగాభవాని(59) మన మధ్య లేకపోవటం అత్యంత బాధాకరమని జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. పర్చూరు మండంలోని నాగులపాలెంలో మంగళవారం గంగాభవాని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి భర్త కొల్లా సుభాష్‌బాబు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బంధుమిత్రులు, వివిధ పార్టీల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి గంగా భవాని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జడ్పీ సిఇఓ బి బాలిరెడ్డి, మాజీ ఛైర్మన్ ముక్కు కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బాచిన చెంచుగరటయ్య, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ రావి పద్మావతి, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలువురు జడ్పీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు అధికారులు గంగాభవాని మృతదేహానికి నివాళులర్పించారు.


ఇంకొల్లు ఆర్టీసి బస్టాండ్‌లో దుకాణాలను పరిశీలిస్తున్న డిపో మేనేజర్ శ్యామల

## ఆర్టీసి బస్టాండ్‌లో ఖాళీ స్థలాలు లీజుకు: డిఎం

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్:** ఇంకొల్లు ఆర్టీసి బస్టాండ్‌లో ఖాళీ స్థలాలను లీజుకు ఇస్తామని చీరాల డిపో మేనేజరు డి శ్యామల పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాలను వ్యాపారం నిమిత్తం లీజుకు ఇస్తామని, తద్వారా వ్యాపార లావాదేవీలు కొనసాగించుకోవచ్చని అన్నారు. బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. అక్కడి వ్యాపారులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షులు అన్నంభొట్ల మోహన్‌కృష్ణ.. డిఎం శ్యామలదేవికి సమస్యలను వివరించారు. కరోనా సమయంలో ఇంకొల్లు బస్టాండ్‌కు వచ్చే 8 నైట్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. బాపట్ల-ఇంకొల్లు, ఇంకొల్లు గుంటూరు సర్వీసులను పెంచాలని కోరారు. ఒంగోలు నుంచి బిహెచ్‌ఇఎల్ సర్వీసులను పెంచాలని మోహన్‌కృష్ణ కోరారు. ఇంకొల్లు కంట్రోలర్ షేక్ బాబు, సిబ్బంది ఉన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైవి సుబ్బారెడ్డి తదితరులు

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-అద్దంకి**

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నూతన క్యాలెండర్‌ను ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్ తాడేపల్లిలో ఉన్న వైవి సుబ్బారెడ్డిని కలిసి ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో జాగర్లమూడి యలమందరావు, జమ్మలమడక హనుమంతరావు, కుందుర్తి రాఘవరెడ్డి, రావినూతల వెంకట సుబ్బయ్య, చేబ్రోలు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి అభినందన

**ప్రజాశక్తి-కర్లపాలెం**

కర్లపాలెం మండలం చింతలపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పృథ్వీరెడ్డి డిసెంబర్ నెలలో గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. జనవరి ఏడో తారీఖు నుంచి 9వ తారీకు వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో అండర్-16 బాయ్స్ విభాగంలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు డి శ్రీనివాసరావు, పిడి గోపి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పృథ్వీరెడ్డిని అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

**ప్రజాశక్తి-అద్దంకి**

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటరు ఆఫిస్ ఆటోమేషన్ కోర్సులో భాగంగా 3 నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏవి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా 10వ తరగతి ఆపై చదివిన యువతీ యువకులు ఈ నెల 10వ తేదీ లోపల పాలిటెక్నిక్ కళాశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ శిక్షణ అనంతరం స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉపయోగపడుతుందన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఆరు వేల రూపాయలు ఫీజు చెల్లించి తమ పేరును కళాశాల ఆఫీసులో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవి ప్రసాద్ తెలిపారు.

## 6 నుంచి కబడ్డీ పోటీలు

**ప్రజాశక్తి-మేదరమెట్ల**

మండలంలోని శ్రీ భ్రమరా వారి ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8 తేదీలలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల క్రీడాకారులతో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలు అయిన వారికి మొదటి బహుమతిగా లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండో బహుమతిగా 75,000, మూడో బహుమతిగా 50,000, నాలుగో బహుమతిగా 25,000 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్ర భాస్కరరావు, ఉపాధ్యక్షులు గోపాల్‌రావు, ట్రెజరర్ దాసరి రమేష్, కోఆర్డినేటర్ పతంగి ఆంజనేయులు, సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల సంక్షేమం పట్ల చిన్నచూపు

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్
- కారంచేడు మృతవీరులకు నివాళి



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

**ప్రజాశక్తి-చీరాల**

దళితుల ఓట్లతో పట్టం కట్టుకుంటున్న పాలకులు వారి సంక్షేమం పట్ల మాత్రం చిన్నచూపు చూడటం దారుణమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని విజయనగర కాలనీలో ఉన్న కారంచేడు మృతవీరుల రుధిరక్షేత్రాన్ని ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన సందర్శించి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 90 శాతం మంది దళితులు వారి జీవనశైలి దయనీయంగా ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో ఉన్న చీమకుర్తి గనులలో ఒక్క దళితులకు కూడా గనులు లేవని, చీరాల ప్రాంతంలో ఉన్న రొయ్యల చెరువుల యజమానుల్లోనూ దళితులు లేరని అన్నారు. దళితులకు అంబేద్కర్ ఆశయాలు ఒక్కటే ఉంటే సరిపోవని.. ఆర్థికంగా కూడా దళితులు అభివద్ధి చెందినప్పుడు మాత్రమే దళితులకు అసలైన అభివద్ధి సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. దళితులను అడ్డం పెట్టుకొని అగ్రకులాలు కోటీశ్వరులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కోటి జేమ్స్, గోసాల ఆశీర్వాదం, దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, సిరి భగతసింగ్, పాలడుగు విజేంద్రబహుజన్, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, దుడ్డు వెంకటేశ్వర్లు, దుడ్డు వందనం, గుమ్మడి సంజీవరావు, మెడికొండ రమేష్ పాల్గొన్నారు.

కొత్తపట్నం ప్రజలకు

# బాలినేని క్షమాపణలు చెప్పాలి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల
- నేడు బకింగ్‌హామ్ కెనాల్ వద్ద నిరసన



మాట్లాడుతున్న దామచర్ల

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

గత నాలుగేళ్ల కాలంలో 20 శాతం పనులు కూడా చేయని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొత్తపట్నం ప్రజలకు క్షమాపణలు చెప్పాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం కొత్తపట్నం నాయకులు, నియోజకవర్గ, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తపట్నం గ్రామ పంచాయతీలో వున్న బకింగ్‌హామ్ కెనాల్ వద్ద నిరసన కార్యక్రమం చేయాలన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.14 కోట్లతో మంజూరు చేసి 80 శాతం మేరకు పనులు జరిగాయన్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా పనిచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఏమి చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు రోడ్ షోలు, సభలకు లక్షలాదిమంది ప్రజలు ప్రభంజనంలా తరలివస్తుంటే ఓర్వలేని వైసిపి ప్రేరేపిత తోపులాటలు.. తొక్కిసలాటలు చేయించి తప్పుడు సంకేతాలను సష్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు సభలు, రోడ్ షోలు అడ్డుకునేందుకు ప్రభుత్వం 1861 యాక్ట్ ద్వారా జీవో విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఈనెల 26న జరిగే లోకేష్ బాబు 'యువ గళం' పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలో భాగమే జీవో అని తెలిపారు. నారా లోకేష్ చేపట్టే యువ గళం పాదయాత్రను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. 1861 యాక్ట్ జీవోను వెంటనే రద్దుచేసి, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగం కల్పించిన హక్కులను కొనసాగిస్తూ చంద్రబాబు నాయుడు రోడ్ షోలకు సభలకు పోలీస్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ద్వారాబాకుల శ్రీనివాసరెడ్డి, రామచంద్రగౌడ్, పోలరాజు, నాళం నరసమ్మ, బలగాని వెంకటేశ్వర్లు, కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, పి.వెంకటేశ్వర రెడ్డి, షేక్ కఫిల్ బాషా, గార్లపాటి శ్రీనివాసరావు, మండల నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# అర్హులకు పెన్షన్ అందేలా చర్యలు

లబ్ధిదారులకు నగదు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్



పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

అర్హులందరికీ వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుక అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా పెంచిన నగదుతో కలిపి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని మంగళవారం రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇందుకు అనుబంధంగా స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు నగదు అందించారు. తొలుత సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్, ఇతర అధికారులు పూలమాల వేసి.. నివాళులర్పించారు. పెన్షన్ పెంపు వివరాలతో ప్రభుత్వం రూపొందించిన గోడపత్రికను ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ బి.బాబూరావు, మెప్మా పీడీ రవి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయండి

- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్
- ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో భూముల పరిశీలన



కలెక్టర్‌కు వివరాలు వెల్లడిస్తున్న తహశీల్దార్ మురళి

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టు కోసం భూములకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మ్యాపులతో సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అర్బన్ హౌసింగ్ ప్రాజెక్ట్ కోసం ఒంగోలు పరిసర ప్రాంతాలలోని భూములను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాలలోని అల్లూరు, మల్లేశ్వరపురం, కరవది, అగ్రహారం, చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెంలలో ఆయన పర్యటించారు. సుమారు 500 ఎకరాల భూమి కావాల్సి ఉన్నందున ఆ మేరకు భూముల లభ్యతపై ఆయన ఆరా తీశారు. కలెక్టర్ వెంట సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, ఆర్డీవో విశ్వేశ్వర రావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఏపిసిపిడిసిఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ పి.మురళి, కొత్తపట్నం తహశీల్దార్ రమణారావు, ఇతర అధికారులు ఉన్నారు.



భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా చర్చల్లో పాల్గొన్న ప్రకాశం జిల్లా నాయకులు.. కార్యదర్శి నివేదికపై ప్రకాశం జిల్లా నుంచి కాలం సుబ్బారావు, రఫీ చర్చించారు. - ప్రజాశక్తి, ఒంగోలు



ఐద్వా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రమాదేవి

## సమానత్వం కోసం సమైక్య పోరాటం

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

సమానత్వం కోసం సమైక్య పోరాటం అనే నినాదంతో ఐద్వా జాతీయ మహాసభలు జరుగుతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల జిల్లా కార్యాలయం వద్ద జిల్లా నాయకురాలు ఎన్.మాలతి ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఈనెల 6 నుండి 9వ తేదీ వరకు కేరళ రాజధాని తిరువనంతపురంలో ఐద్వా జాతీయ 13వ మహాసభలు జరుగుతున్నాయని, దేశం నలుమూలల నుండి మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ 850 మంది పైగా ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతున్నారన్నారు. ఆరో తేదీ ఉదయం 10 గంటలకు "బాల్య" నత్య కళాకారిణి, కేరళ కళా మండలం ఛాన్సలర్ మల్లికా సారాభాయ్ మహాసభలను ప్రారంభిస్తారన్నారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు, ఐద్వా జాతీయ నాయకురాలు బందాకారత్ ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ మహాసభల్లో దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చిస్తారని, గడచిన మూడేళ్ల కాలంలో నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకురాళ్లు ఏ.ఎతామాలక్ష్మి, ఎస్‌కె.నాగూర్‌బీ, నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, నగర అధ్యక్షురాలు బి.గోవిందమ్మ, ఐద్వా నగర నాయకులు కె.రాజేశ్వరి, బి.పద్మ , జి.కళ్యాణి, బి.పెద్ద గోవిందమ్మ, పాల్గొన్నారు.

**చదువుల తల్లి సావిత్రిబాయి పూలే**

సమాజంలో అసమానతలు రూపుమాపాలని, మహిళలకు విద్య అవసరమని భావించి మొట్టమొదటి మహిళా పాఠశాల స్థాపించిన సావిత్రిబా పూలే అసలైన చదువుల తల్లి అని ఐద్వా జిల్లా కార్యదర్శి కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలో సావిత్రిబాపూలే 192వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సావిత్రిబాపూలే చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి పూలమాల వేశారు. కార్యక్రమానికి ఐద్వా నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్ళు కె.రాజేశ్వరి, జి.కళ్యాణి, నాగేశ్వరమ్మ కే అరుణ, కె.శ్రీలత, కె.శ్రీరంజని, ఏ .సత్యవతి, కె.తులశమ్మ, యన్.హరిణి, కే కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

**కెవిపిఎస్ ఆధ్వర్యంలో..**

సావిత్రిబాయి పూలే 192 వ జయంతిని కెవిపిఎస్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక విజేత హైస్కూల్‌లో జరిపారు. కార్యక్రమానికి కెవిపిఎస్ నగర నాయకులు ఏ. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, విజేత హై స్కూల్ కరస్పాండెంట్ వి రమణ, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి పనులు జరిగేటప్పుడు

# హడావుడి ఎందుకు?

-మాజీ ఎమ్మెల్యే దామచర్లపై ఎమ్మెల్యే బాలినేని విమర్శ
-బ్రిడ్జి పనుల్లో కమిషన్లకు కక్కుర్తి పడింది నీవేనని ఆరోపణ

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

బకింహామ్ కెనాల్‌పై బ్రిడ్జి పనులు జరుగుతున్న సమయంలో తెలుగు దేశం పార్టీ నాయకులు ఎందుకు హడావుడి చేస్తున్నారని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రిడ్జి పనులు గత ప్రభుత్వంలో కమిషన్‌లకు కక్కుర్తి పడి ఆయన సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కట్టబెట్టారని ఆరోపించారు. ఆ పనుల్లో రూ.2 కోట్లు కమిషన్లు తీసుకొని పనులు ముందుకు సాగనీయకుండా కాంట్రాక్టర్‌తో నిత్యం టచ్‌లో ఉంటూ జనార్ధన్ పైశాచిక ఆనందం పొందారని విమర్శించారు. ఇటీవల బ్రిడ్జి కాంట్రాక్టర్‌తో తాను మాట్లాడి బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పానని, పనులు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించానని పేర్కొన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ బ్రిడ్జి పనులు ప్రారంభించారని వివరించారు. బ్రిడ్జి పనులు ఎక్కడ పూర్తవుతాయోనని భయపడి ఇప్పుడు పనులు జరుగుతున్న సమయంలో అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు హడావుడి చేయాలనే ఆలోచనను ప్రజలందరూ గమనిస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం వాటా నిధులతో ఈ బ్రిడ్జి పనులు జరుగుతున్న సంగతి దామచర్ల జనార్ధన్‌కు తెలియదా..? అని ప్రశ్నించారు. ఏదైతే కేంద్రప్రభుత్వం స్కీంతో పనులు ప్రారంభమయ్యాయో ఆ స్కీం రద్దు అయిన విషయం నీకు తెలియదా అని జనార్ధన్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా దామచర్ల జనార్ధన్ ప్రజలను మభ్యపెట్టే పనులు మానుకోవాలని హితవు పలికారు.



ఏడిఏకి అర్జీ ఇస్తున్న రైతుసంఘం నాయకులు

పంట నష్టపరిహారంలో

# వివక్ష తగదు..

- రైతులకు న్యాయం చేయాలి
- ఏడిఏకి రైతుసంఘం నాయకుల వినతి

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

మిర్చి పంట సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకీ నిబంధనలతో పనిలేకుండా పంట బీమా సవరణ చేసి నష్టపరిహారం చెల్లించి.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్టూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కెఐ. సుదర్శనరాజుకి మంగళవారం రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం కూడా మిర్చి వేసిన రైతులకు మండూస్ తుఫాన్, బొబ్బర, తామర పురుగు కారణంగా పంట చేతికందే పరిస్థితి కనబడటం లేదన్నారు. అధికారులు స్పందించి వర్షాధారం, నీటి కింద సాగు అనే నిబంధనలు సవరించి నష్టపోయిన మిర్చి రైతులకు బీమా వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరవల్లి కష్ణమూర్తి, శేషాద్రి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.